పాఠాలు చెప్పించాల్సింది ప్రభుత్వమే



పాఠాలు చెప్పించాల్సింది కూటమి ప్రభుత్వమే. అధికారంలో ఉన్న ప్రభుత్వమే విద్యార్థుల ప్రయోజనాలను చూసుకోవాలి. పేద, మధ్యతరగతి కుటుంబాలకు మేలు చేయాలే తప్ప అన్యాయం చేయకూడదు. వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసి రాష్ట్రంలో మెడికల్ కళాశాలల నిర్మాణాలను చేపట్టింది. ఆ కళాశాల విషయంలో కూటమి ప్రభుత్వం రాజకీయాలు చేయడం సరికాదు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన మెడికల్ సీట్లను రాష్ట్రానికి కేటాయించాలి.

-ప్రేమ్‌సాగర్, నీట్ విద్యార్థి, చిత్తూరు



గత ప్రభుత్వానికి పేరు వస్తుందనే



గత ప్రభుత్వానికి పేరు వస్తుందనే కూటమి ప్రభుత్వం నిందలు వేస్తోంది. మంత్రి అన్న మాటలు బాధాకరం. రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను ప్రారంభిస్తే మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌కు పేరు వస్తుందని కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోంది. మెడికల్ కళాశాలలను ప్రారంభిస్తే వేలాది మంది విద్యార్థులకు వైద్య విద్య అందుతుంది. మెడికల్ కళాశాల విషయంలో కూటమి ప్రభుత్వం స్పష్టమైన హామీని ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం.

-భరత్, నీట్ విద్యార్థి, చిత్తూరు

క్లుప్తంగా

ఆటో బోల్తా


తీవ్రంగా గాయపడిన యువకుడు

ఐరాల: మండలంలోని అగరంపల్లె వద్ద ఆదివారం వేకువజామున ఆటో బోల్తా పడిన ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. గుడిపాల మండలం వసంతాపురం, కొత్తకోటకు చెందిన రాకేష్, పవన్, హేమంత్ శనివారం వారి స్వగ్రామాల నుంచి ఆటోలో కాణిపాకం ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం తిలకించడానికి వచ్చారు. ఆదివారం వేకువజామున ఆటోలో ముగ్గురు కలిసి వారి స్వగ్రామాలకు బయలుదేరారు. అయితే అగరంపల్లె వద్ద వారు ప్రయాణిస్తున్న ఆటో ప్రమాదవశాత్తు బోల్తా పడ్డడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడిని వీరిని స్థానికులు చికిత్సం కోసం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

కంటి వైద్యశిబిరానికి స్పందన


కంటి వైద్య చికిత్సలు చేస్తున్న వైద్యురాలు

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని గాంధీరోడ్డులో ఉన్న లిటిల్ రోజ్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతమైనట్లు కరస్పాండెంట్ గోపాలకృష్ణమూర్తి తెలిపారు. ఈ మేరకు ఆయన విలేకరులతో మాట్లాడుతూ నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నట్లు చెప్పారు. శిబిరంలో 236 మందికి చికిత్సలు నిర్వహించగా, 52 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దిశా అగర్వాల్, శివప్రకాష్, అకడమిక్ ఇంచార్జి దుర్గశ్రీ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం


అదృశ్యమైన అఖిల

తవణంపల్లె: మండలంలోని తెల్లగుండ్లపల్లె దళితవాడలో మహిళ అదృశ్యమైనట్లు ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. తెల్లగుండ్లపల్లె దళితవాడకు చెందిన దాము కుమార్తె అఖిల(20) మానసిక వ్యాధితో బాధపడుతోంది. ఈమెకు వివాహమై విడాకులు కూడా తీసుకుంది. మానసికంగా బాధపడుతూ గతంలో కూడా మూడుసార్లు ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయినట్లు తెలిపారు. ఈ నెల 4వ తేదీన అఖిల(20) ఇంటి నుంచి వెళ్లిపోయిందని తండ్రి దాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. అమ్మాయి ఆచూకీ తెలిసిన వారు వెంటనే ఎస్‌ఐ 9440900685 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

గురువే సమాజానికి మార్గనిర్దేశకుడు

పలమనేరు: గురువే సమాజానికి సరైన మార్గనిర్దేశకమని కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన అచలానంద మఠం రవిచంద్ర పేర్కొన్నారు. పలమనేరు సమీపంలలోని కీలపట్ల కోనేటి రాయుని సన్నిధిలో ఆదివారం శ్రీ సూర్యనారాయణ భాగవతుల 15 వార్షికారాధన నిర్వహించారు. తొలుత ప్రభాతసేవ, లఘు గీతా పారాయణం వేదాంత వైజ్ఞానిక సభ కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రమాదాలకు చెక్ పెట్టేదెలా..!

- ప్రమాదాలకు నిలయంగా మారిన మొగిలి ఘాట్
- దొరచెరువు నుంచి మొగిలి వరకు డౌన్
- వాహనాలను న్యూట్రల్ చేయడంతోనే ప్రమాదాలు
- కాంక్రీట్ గోడ నిర్మించాలంటున్న ప్రజలు
- పాలకులైనా స్పందించాలంటున్న ప్రయాణికులు


మొగిలిఘాట్‌లో మలుపు రోడ్డు


ఆర్టీసీ బస్సును ఢీకొన్న కంటైనర్(ఫైల్)

బంగారుపాళెం: ప్రమాదాలకు నిలయంగా మొగిలి ఘాట్ మారింది. వరుస ప్రమాదాలు ప్రయాణికులను కలవర పెడుతున్నాయి. ఏడాదికి ఒకసారి ఘోర ప్రమాదాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ప్రమాదాల జాబితాను పరిశీలిస్తే ఎక్కువగా పలమనేరు నుంచి చిత్తూరు వచ్చే క్రమంలో మొగిలి ఘాట్ వద్దే చోటు చేసుకోవడం కలవర పెడుతోంది. చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిలో దొరచెరువు సమీపం నుంచి రోడ్డు డౌన్(ఏటవాలుగా)గా ఉండడం వల్ల వాహనాల వేగం పెంచుతున్నారు. బెంగళూరు–చెన్నై జాతీయ రహదారి మీదుగా రోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అదేవిధంగా వివిధ వస్తువులను రవాణా చేయడం జరుగుతోంది. ఈ నేపథ్యంలో లారీ, కంటైనరు వంటి వాహన డ్రైవర్లు డీజిల్ ఆదా చేసే క్రమంలో వాహనాలను న్యూట్రల్ చేసి నడుపుతుంటారు. ఈ క్రమంలో వాహనాలు వేగం పెరిగి అదుపు చేయలేని పరిస్థితుల్లో డివైడరును దాటి పక్క రోడ్డుపై వచ్చే వాహనాలను ఢీకొనడం, ముందు వెళ్లే వాహనాలను ఢీకొనడం, కంట్రోల్ చేయలేక అదుపుతప్పి బోల్తా పడుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో డ్రైవర్లు జాగ్రత్తగా వాహనాలను నడపాల్సి ఉంటుంది. తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటుండడంతో పోలీసులు హైవేపై బారికేడ్లు, స్పీడ్ బ్రేకర్లు, డేంజర్ సూచిక బోర్డులు పెట్టి ప్రమాదాలను నివారించే చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఫలితం లేకపోతోంది. ఈ నెల 13వ తేదీ ఇనుప కమ్మీల లోడుతో చిత్తూరు వైపు వెళ్తా డివైడరును దాటి బెంగళూరు పోతున్న ఆర్టీసీ బస్సును ఢీకొన్న విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో సంఘటనా స్థలంలో 7 మంది దుర్మరణం చెందారు. 2019లో ఇదే తరహాలోనే డ్రైవర్ లారీని న్యూట్రల్‌లో నడపడంతో డివైడరును ఢీకొట్టి పక్క రోడ్డులో ఎదురుగా వస్తున్న ఓమినీ వ్యాన్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో 11 మంది చనిపోయారు. ఇలాంటి ప్రమాదాలు తరచూ చోటు చేసుకుంటుండంతో ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నారు. చాలా మంది గాయాల పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో మొగిలి ఘాట్‌లో ప్రమాదాలను ఎలా నివారించాలనే సమస్య అధికారులకు తలనొప్పిగా మారుతోంది.

కాంక్రీట్ గోడ నిర్మిస్తే..

మొగిలి ఘాట్‌లో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో డివైడరు స్థానంలో కాంక్రీట్ గోడను ఏర్పాటు చేయడం ద్వారా ఇలాంటి పెద్ద పెద్ద ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు అవకాశం ఉంటుందని ప్రజలు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. దొరచెరువు నుంచి మొగిలి వరకు సుమారు రెండు కిలో మీటర్ల వరకు మూడు అడుగుల ఎత్తున కాంక్రీట్ వాల్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని అంటున్నారు. మొగిలి ఘాట్ ప్రమాదాలు రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశంగా మారుతోంది.

పాలకులు స్పందించాలి..

మొగిలిఘాట్ ప్రమాదాల నివారించేందుకు ప్రజాప్రతినిధులు స్పందించాల్సిన అవసరం ఉంది. మొగిలిఘాట్‌లో ప్రమాదం అంటే ఉమ్మడి రాష్ట్రాల్లో చర్చించుకునేలా చోటు చేసుకుంటుంది. ప్రమాదాలను నివారించేందుకు ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు, నేషనల్ హైవే అధికారులు ప్రమాదాల నివారణకు అవసరమైన సాంకేతిక అంశాలను గురించి చర్చించి నివారణకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. హైవే ప్రమాదాలపై త్రైమాసిక సమావేశాలను నిర్వహించి ప్రమాదాలపై చర్చలు జరిపి నివారణకు మార్గాలను అన్వేషించాల్సి ఉంది.

సెలవయ్యా.. బుజ్జి బొజ్జ గణపయ్యా..

తవణంపల్లె: మండలంలోని కె.పట్నంలో ఆదివారం సాయంత్రం భక్తిప్రవత్తులతో వినాయకుడి నిమజ్జనం కోలాహలంగా జరిగింది. గ్రామంలో యువత వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి తొమ్మిది రోజుల పాటు అభిషేకం, పూజ కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం యువకులు గణేష్ బొప్పా మోరియా అంటూ రంగులు చల్లుకుని స్వామివారిని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

వినాయకుడి లడ్డూ ధర రూ.15,500

వినాయక చవితి సందర్భంగా నిత్య పూజలందుకున్న గజేంద్రుడికి దాతలు లడ్డూను ప్రదానం చేశారు. నిమజ్జనం సందర్భంగా స్వామివారి లడ్డూను వేలంలో స్థానికుడు ధనుంజయ రూ.15,500 ధరకు పాడి దక్కించుకున్నాడు. అనంతరం స్వామివారి లడ్డును భక్తులకు పంచిపెట్టారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: మండల కేంద్రం బంగారుపాళెం, దళితవాడ తదితర గ్రామాల్లో ఆదివారం రాత్రి కోలాహలంగా వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. 9 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించిన యువత.. ఆదివారం సాయంత్రం ఉట్లు కొట్టే కార్యక్రమంలో భాగంగా పెద్దసంఖ్యలో యువకులు ఉట్టి కొట్టేందుకు ఉత్సాహం చూపారు. అనంతరం వినాయకుడి ప్రతిమలను నిమజ్జనానికి తరలించారు.


నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

రేపటి నుంచి కాణిపాకంలో ప్రత్యేక ఉత్సవాలు


కాణిపాకం వినాయకస్వామి ఆలయం

- సర్వం సిద్ధం చేసిన ఆలయ అధికారులు
- నేటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు

ఐరాల/తవణంపల్లె: కాణిపాకం వరసిద్ధ వినాయక స్వామి నవరాత్రి ఉత్సవాలు సోమవారం రాత్రి ధ్వజావరోహణంతో ముగియనున్నాయి. మంగళవారం ఉదయం నుంచి స్వామివారి నుంచి ప్రత్యేక ఉత్సవాలను శాస్త్రోక్తంగా ప్రారంభించనున్నారు. ఈ నెల 17 నుంచి 27వ తేదీ వరకు కొనసాగనున్న ఈ ఉత్సవాల్లో సిద్ధి, బుద్ధి సమేతంగా వినాయక స్వామి పలు వాహనాల్లో అధిష్ఠించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి..

ప్రత్యేక ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ గురుప్రసాద్ తెలిపారు. 14 గ్రామాలకు చెందిన ఉభయదారుల ఆధ్వర్యంలో నిర్వహించే ఉత్సవాలు కావడంతో వారికి సకల సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ ఉత్సవాల్లో కూడా భక్తులకు ప్రత్యేక క్యూలైన్‌లు యథావిధిగా ఉంటాయని వెల్లడించారు. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు నిత్యఅన్నదానం కొనసాగుతుందని వివరించారు.

వాహనసేవల వివరాలు	
17వ తేదీ	మంగళవారం అధికార నంది వాహనం
18న	రావణబ్రహ్మ వాహనం
19న	యాళి వాహనం
20న	విమానోత్సవం
21న	పుష్ప పల్లకి సేవ
22న	కామధేను వాహనం
23న	సూర్యప్రభ వాహనం
24న	చంద్రప్రభ వాహనం
25న	కల్పవృక్ష వాహనం
26న	పూలంగి సేవ
27న	తెప్పోత్సవం

వెల్లి విరిసిన దశాబ్దాల స్నేహగీతం


ఉపాధ్యాయులతో కలసి గ్రూప్ ఫొటో దిగుతున్న పూర్వ విద్యార్థులు


తవణంపల్లె హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూతలపట్టు: మండల కేంద్రంలోని పూతలపట్టులో ఉన్నత పాఠశాలలో 1979–80 సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు నాలుగున్నర దశాబ్దాల తర్వాత మళ్లీ ఆదివారం కలుసుకున్నారు. దాదాపు 44 ఏళ్ల తర్వాత కలుసుకుని ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా వారు ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకుని స్కూల్లో గడిపిన క్షణాలను గుర్తు చేసుకున్నారు. చాలా ఏళ్ల తరువాత కలుసుకోవడంతో అక్కడ పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా వారికి విద్య నేర్పిన గురువులు రాజారెడ్డి, ఎర్రయ్య, విశ్వనాథ్ రెడ్డి, సుబ్బరామానాయుడు, రాధాకృష్ణ, జయరాం నాయుడును దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ భవిష్యత్‌కు పునాది వేసిన పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇన్నేళ్ల తరువాత వారు కలుసుకోవడానికి కృషి చేసిన మిత్రులు సురేందర్ నాయుడు, చంద్రారెడ్డి, జయరాజ్‌ను తోటి మిత్రులు ఘనంగా సన్మానించారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

తవణంపల్లె: మండల కేంద్రమైన తవణంపల్లె ఉన్నత పాఠశాలలో 2000–2001 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదవుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా కలుసుకున్నారు. వారు నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆనాటి గురువులతో కలిసి ఒకరికి ఒకరు ప్రేమానురాగాలు పంచుకున్నారు. తమకు పాఠాలు నేర్పిన గురువులకు పాదపూజ చేసి, శాలువాలు కప్పి, పూలమాలలు వేసి గురు భక్తిని చాటుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

కల్యాణం.. కమనీయం

గంగవరం: శ్రవణా నక్షత్రం సందర్భంగా ఆదివారం మండలంలో టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామి ఆలయంలో కల్యాణోత్సవం నిర్వహించారు. ఉదయం శ్రీవారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, నైవేద్య ఘంటానాదం, పూజార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఉద్యమాల్లో మహిళలు ముందుండాలి

చిత్తూరు కార్పొరేషన్: సమస్యల సాధనకు ఉద్యమాలు అవసరమని అందులో మహిళలు ముందు ఉండాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం చిత్తూరులో నిర్వహించిన కార్మికుల సదస్సులో మాట్లాడారు. కార్మిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఎన్నికల సమయంలో కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్మికుల హక్కుల సాధన యూనియన్ లక్ష్యమన్నారు. అన్ని రంగాల్లో మహిళలు ప్రథమ స్థానంలో ఉండాలన్నారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.పీ.హరికృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వానికి పథకాల అమలుపై ఉండే యోచన కార్మికుల సమస్యల పరిష్కారాలపై లేదన్నారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్నభోజన పథకం కార్మికులకు కనీసవేతనాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేంద్రనాథ్, వెంకటరత్నం, రామిశెట్టి, వెంకయ్య, షాహీనా, లక్ష్మి,ధనలక్ష్మి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

అద్భుతం.. కళాకారుల నృత్యం


భరత నాట్యం చేస్తున్న కళాకారిణులు


నృత్య ప్రదర్శనలు చేస్తున్న కళాకారిణులు

కాణిపాకం శ్రీ స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన నృత్య, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆస్థాన మండపంలో కళాకారుల భరతనాట్య ప్రదర్శనలు రంజింపజేశాయి. నాటక ప్రదర్శనలు, భక్తిగీతాల కచేరి అలరించాయి. కళాకారులకు పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఆలయ ఈఓ గురుప్రసాద్ కళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

-ఐరాల/తవణంపల్లె


కళాకారులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఈఓ గురుప్రసాద్




కళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్, భక్తి గీతాలు ఆలపిస్తున్న గాయకులు, హరికథ గానలాపన చేస్తున్న భాగవతారిణి

అద్భుత కట్టడాల సృష్టికర్త మోక్షగుండం


నివాళి అర్పిస్తున్న డీఈ దస్తగిరి, ఇంజినీర్లు

చిత్తూరు కార్పొరేషన్: సాంకేతిక పరిజ్ఞానం లేని రోజుల్లో నిర్మాణ రంగంలో అద్భుతాలను సాధించిన ఘనత మోక్షగుండం విశ్వేశ్వరయ్యదని ఆర్‌అండ్‌బీ డీఈ దస్తగిరి తెలిపారు. ఆదివారం ఆర్‌అండ్‌బీ అతిథిగృహ ఆవరణలో చిత్తూరు ఆర్కిటెక్ట్స్ అండ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి, ఇంజినీర్స్ డేని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు ఆర్కిటెక్ట్స్, ఇంజినీర్లు విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం డీఈ దస్తగిరి మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రం మైసూర్‌లో 1861లో జన్మించి ఇంజినీర్ వృత్తిని చేపట్టారన్నారు. నిజాం నవాబుల పాలనలో హైదరాబాద్ మూసీ నదికి వరదలు వచ్చినప్పుడు నవాబు మోక్షగుండం సలహా మేరకు డ్యామ్ నిర్మించారన్నారు. కావేరి జలాల సమస్య వచ్చినప్పుడు కృష్ణా బ్యారేజ్ నిర్మించారని గుర్తు చేశారు. తిరుమల ఘాట్‌రోడ్డు నిర్మించి ప్రపంచ ప్రఖ్యాతి చెందిన వ్యక్తిగా గుర్తింపు పొందారన్నారు. నేటి ఇంజినీర్లకు ఆయన ఆదర్శమని వివరించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ అధికారులు, అసోసియేషన్ అధ్యక్షుడు జయప్రకాష్, కార్యదర్శి విజయకుమార్, కోశాధికారి గుణశేఖర్, సభ్యులు జ్యోతీశ్వరన్, సురేంద్రరెడ్డి, కేథార్‌నాథ్, బాలాజీ పాల్గొన్నారు.


విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్‌ఈ, విద్యుత్ సిబ్బంది

మోక్షగుండంకు నివాళి

పూతలపట్టు: భారతదేశపు మొదటి ఇంజినీరుగా ప్రసిద్ధికెక్కిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య 164 జయంతి సందర్భంగా ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ సురేందర్ నాయుడు ఆదివారం మోక్షగుండం చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య చేసిన సేవలను కొనియాడారు. అనంతరం పూతలపట్టు ఏఈ నరసింహులు, సిబ్బంది ఎస్‌ఈని శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఈ జయరాజ్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.